సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 7 । అక్టోబర్ । 2023



అప్పులు, వివాహేతర బంధంతోనే అంతం?

అప్పులు, వివాహేతర సంబంధమే హెడ్ కాని స్టేబుల్ ఆత్మహత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. -8లో



నాటు సారాపై గట్టి నిఘా

జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయ కేంద్రాలపై నిఘా ఉంచాలని అడిషనల్ ఎస్పీ వీజీ రాజ్‌కమల్ అన్నారు. చెక్‌పోస్టులవద్ద వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.86	రూ.110
రెండోరకం	రూ.50	రూ.82



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 381 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	460	470
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 238.040 కిలోలు

న్యూస్‌రీల్

దసరాకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: దసరా పండుగ సందర్భంగా బెంగళూరు,హైదరాబాద్‌లకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. సాధారణ చార్జీలతో దసరా స్పెషల్ బస్సులు నడపుతామన్నారు. టిక్కెట్లు కావాల్సిన వారు 7382875034 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

8న షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నిమ్మనపల్లెరోడ్డులోని వశిష్ట స్కూలులో ఈనెల 8న జిల్లా షూటింగ్ బాల్ సబ్ జూనియర్ జట్ల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 01.04.2007 తరువాత పుట్టి ఉండాలన్నారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. జట్టుకు ఎంపికైన వారు పీలేరు మండలం కె.వి.పల్లిలో జరుగు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 6281881022 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

7 నుంచి వాలీబాల్ సమరం



కడప స్పోర్ట్స్: వైఎస్సార్ జిల్లా మైదుకూరు పట్టణంలోని మేధా డిఫెన్స్ అకాడమీ క్రీడా మైదానం వేదికగా అండర్–17 బాలబాలికల రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు రంగం సిద్ధమైంది. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరుకానున్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణ కుమారి తెలిపారు. వివిధ జిల్లాల క్రీడాకారులకు కడప, యర్రగుంట్ల రైల్వే స్టేషన్లలో బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టోర్నమెంట్‌కు నియమించిన వ్యాయామోపాధ్యాయలు వారి విధులను చక్కగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆమె కోరారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి



పెద్దతిప్పసముద్రం హైస్కూల్‌లో భోజనం వడ్డిస్తున్న డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం

పెద్దతిప్పసముద్రం: సులభ పద్ధతుల్లో నాణ్యమైన విద్యను బోధించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తెలుగు హైస్కూల్‌ను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. నాడు–నేడు పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశమై పలు సూచనలిచ్చారు. కు వివిధ పాఠ్యాంశాలకు సంభందించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. మండలంలోని పాఠశాలలు, ఉపాధ్యాయుల పనితీరుపై ఎంఈఓ నారాయణ, ఎంఈఓ–టూ గౌస్‌పీర్‌ను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు డీఈఓను సత్కరించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

కేవీపల్లి: రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఐదుగురు గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు తెలిపారు. తిరుపతి ఏపీజేఎస్ఎం హైస్కూల్‌లో 67వ ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించారు. ఇందులో గ్యారంపల్లె ఏపీ రెసిడెన్సియల్ కళాశాలకు చెందిన ఎస్. ఇబ్రహీం త్రోబాల్‌లో, వి. సుధీర్‌కుమార్, బి. శశివర్ధన్ బాల్‌బ్యాడ్మింటన్‌లో, టెన్నికాయిట్‌లో సి. ప్రభాస్, ఎస్. పవన్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులకు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో అధ్యాపకులు భూపతి, డాక్టర్ రామకృష్ణ, రమాదేవి, శేఖర్, అన్నపూర్ణ, వెంకటరమణ, హరి, మస్తాన్‌వలి, బలరాం, సౌజన్య, రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ నరేంద్ర పాల్గొన్నారు.

పల్లెకు వెలుగులు



- జిల్లాలో కొత్తగా 36 విద్యుత్ కేంద్రాలు
- 19 మండలాల్లో 33/11 సబ్‌స్టేషన్లు మంజూరు
- భూ కేటాయింపు చర్యల్లో రెవెన్యూ అధికారులు
- నిర్మాణాలకు రూ.70 కోట్ల వ్యయం

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లాలో విద్యుత్ సరఫరా అంతరాయాలు, లోవోల్టేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా ప్రభుత్వం కొత్తగా 36 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చింది. వీటి నిర్మాణాలతో పల్లెలకు విద్యుత్ వెలుగులు ప్రసరించనున్నాయి. ఇప్పటి వరకు కొంత దూరంగా ఉన్న కేంద్రాల నుంచి విద్యుత్ సరఫరా అయ్యేది. అయితే వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం, ఓల్టేజీ సమస్యలు ఎదురయ్యేవి. వీటికి చెక్ పెడుతూ ప్రభుత్వం మారుమూల గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ కేంద్రాలను మంజూరు చేసింది.వచ్చే దశాబ్ద కాలం పాటు విద్యుత్ సమస్య లేకుండా చేసేందుకు చర్యలు చేపట్టింది.

రూ.70 కోట్లతో పనులు

జిల్లాలోని 36 మారుమూల గ్రామాలకు 33/11 విద్యుత్ కేంద్రాలు 36 మంజూరయ్యాయి. నిర్మాణ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలను డిస్కం ఉన్నతాధికారులు చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు (తిరుపతి డిస్కం), కడప డిస్కం ఎస్ఈలు టెండర్లను నిర్వహించి పనులు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తవగానే పనులు ప్రారంభం కానున్నాయి. ఈ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ కలెక్టర్ ఆయా మండలాల తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో కేంద్రానికి ఒక ఎకరా భూమిని కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందులో కొన్ని మండలాల్లో భూ కేటాయింపుల ప్రక్రియ పూర్తవగా మిగిలిన మండలాల్లో స్థలాల గుర్తింపు, కేటాయింపు చర్యలు సాగుతున్నాయి.

ఎన్నో ప్రయోజనాలు

కొత్తగా మంజూరైన విద్యుత్ కేంద్రాలతో ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. సిబ్బందికి సమస్యలు తీరుతాయి. గ్రామాల్లోనే కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటంతో ఇకపై లోఓల్టేజీ సమస్య అన్న మాట వినిపించదు. అంతరాయాలు తగ్గిపోతాయి. నిత్యం నాణ్యమైన సరఫరా ఉంటుంది. ఆయా కేంద్రాల పరిధిలోని వ్యవసాయానికి, గృహాలు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ కనెక్షన్లను ఇవ్వడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపులోడు భారం తప్పుతుంది.



బి.కొత్తకోట ఇందిరమ్మకాలనీ విద్యుత్ కేంద్రానికి కేటాయించిన భూమి

త్వరలో టెండర్లు

కొత్తగా మంజూరైన విద్యుత్ కేంద్రాల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. వీటికి సంబంధించిన టెండర్లను నిర్వహించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నాం. వీటి పనులు పూర్తయ్యాక విద్యుత్ సమస్యలు ఉండవు. ప్రస్తుతం మంజూరైన కేంద్రాలే కాకుండా మరిన్ని ప్రతిపాదనలు అందాయి. వీటిని ప్రభుత్వానికి నివేదించాం.

–కృష్ణారెడ్డి, తిరుపతి డిస్కం ఎస్ఈ

విద్యుత్ కేంద్రాల ఏర్పాటు వివరాలు

మండలం	మంజూరైన గ్రామం
గాలివీడు	చీమలచెరువుపల్లె
గాలివీడు	అరవీడు
రాయచోటి	రాయచోటి పట్టణం
రాయచోటి	రాయచోటి రింగ్‌రోడ్డు
సంబేపల్లె	రౌతుకుంట
వీరబల్లి	తాటిగొండపల్లె
లక్కిరెడ్డిపల్లె	దప్పేపల్లె
గాలివీడు	గోళ్లపల్లె
టి.సుండుపల్లె	మాచిరెడ్డిగారిపల్లె
గాలివీడు	గాండ్లచెరువు
లక్కిరెడ్డిపల్లె	కుమ్మరపల్లె
టి.సుండుపల్లె	చీకటిపల్లె
సంబేపల్లె	నారాయణరెడ్డిగారిపల్లె
రాయచోటి	యేండపల్లె
పెద్దతిప్పసముద్రం	పులికల్లు
ములకలచెరువు	మద్దినాయునిపల్లె
ములకలచెరువు	పాతకోట
ములకలచెరువు	కాలువపల్లె
బి.కొత్తకోట	ఇందిరమ్మకాలనీ
బి.కొత్తకోట	దిన్నిమీదపల్లె
కలకడ	బాలయ్యగారిపల్లె
కలికిరి	సి.బరినేపల్లె
మదనపల్లె	దండువారిపల్లె
రామసముద్రం	మట్లివారిపల్లె
పెనగలూరు	చెక్రయాపేట
పుల్లంపేట	అనంతసముద్రం
పుల్లంపేట	రామలింగాపురం
పుల్లంపేట	సాదువారిపల్లె
రాజంపేట	అన్నమయ్య ప్రాజెక్టు
రాజంపేట	గుండ్లూరు
చిట్వేలి	మార్గవపల్లె
చిట్వేలి	జే.కందులవారిపల్లె
ఓబులవారిపల్లె	బాలారెడ్డిగారిపల్లె
కోడూరు	రెడ్డివారిపల్లె
కోడూరు	బాలాపల్లె
కోడూరు	గబ్బూరువారిపల్లె

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్ర రాజు



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. 'కడప ఉక్కు ఏమైంది' అంశంతో నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రుద్రరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని విభజన చట్టంలో ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమ బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, పోలవరం ప్రాజెక్టు, సెంట్రల్ యూనివర్శిటీ ఏర్పాటు హామీలు కాంగ్రెస్ పార్టీ ఇవ్వడం జరిగిందన్నారు. అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం అవేవీ అమలు చేయకుండా కాలయాపన చేయడం దారుణమన్నారు. ఉక్కు పరిశ్రమకు కావాల్సిన నిధులు, నీరు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నా భాజపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తొలి సంతకం ప్రత్యేక హోదా మీద చేస్తామని తమ అధినేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో అనేక మార్లు తెలిపారన్నారు. అక్టోబర్ 21న మంత్రాలయంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, ఏఐసీసీ కార్యదర్శి మేయప్పన్, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగా గౌతమ్, నాయకులు విష్ణుప్రీతం రెడ్డి, నజీర్ అహ్మద్, బండి జకరయ్య, అహ్మద్, ఆలీఖాన్, చెప్పలి పుల్లయ్య, చార్లెస్, లక్షుమయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

రైల్వేకోడూరు: శెట్టిబలిజలను బీసీల్లో చేర్చడం సంతోషమని, ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని బొజ్జవారిపల్లె గ్రామ మహిళలు పేర్కొన్నారు. శుక్రవారం సర్పంచ్ మావిళ్ల సుబ్బయ్య, మాజీ సర్పంచ్ మావిళ్ల సుబ్రమణ్యం, ఉప సర్పంచ్ దాడిశెట్టి సిద్దు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొజ్జవారిపల్లె గ్రామంలో శెట్టిబలిజలు 200 కుటుంబాలు ఉన్నాయని, వీరంతా బీసీల్లోకి చేరడం వల్ల విద్య, ఉద్యోగ, ప్రభుత్వ పథకాల పరంగా లబ్ధి చేకూరుతుందని, భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీలు నెరవేరుస్తూ పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, తుపాకుల వెంకట సుబ్బయ్య, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరం పరిష్కరించాలి

కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా, చిత్రంలోఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు

పెద్దతిప్పసముద్రం: పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారమే 'జగనన్నకు చెబుదాం స్పందన'కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. శుక్రవారం పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్,మదనపల్లి ఆర్డీవో మురళీలు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.వాటిని సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ఇప్పటికే 6 చోట్ల ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయగా ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడుతున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. అర్హులై పథకాలు అందకుంటే వాటిని పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సమక్షంలో మండల కేంద్రాలు వేదికలుగా నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. స్థానిక, మండల స్థాయి ప్రజా ప్రతినిధులు,నాయకులు మహమూద్, శివన్న, కొండా సిద్దార్థ, డ్రిప్ రమణ, గణపతిరెడ్డి, కేవీ రమణ, కుమార్‌రెడ్డి, ఖాదర్‌వలి, తమక శంకర్, రియాసత్ అలీఖాన్, సుబ్బరాం,పప్పు రాజారెడ్డి, పట్టెరిక శంకర్, కార్యం చంద్ర,కొట్టి మల్లి, స్థానిక తహశీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

ఈవీఎం ఫస్ట్ లెవల్ చెక్ కార్యక్రమంలో పాల్గొనాలి

రాయచోటి: ఈనెల మూడో వారంలో జరిగే ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్ (ఎఫ్ఎల్‌సీ) కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా లెక్టర్ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్‌సీకి సంబంధించి ఎలక్షన్ కమిషన్ నుంచి షెడ్యూల్ రాగానే రాజకీయ పార్టీలకు సమాచారం ఇస్తామన్నారు. జిల్లాలో కొత్తగా 31 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామని, అలాగే 88 పోలింగ్ స్టేషన్లలో లొకేషన్ మార్పు, 92 పోలింగ్ స్టేషన్ల పేరు మార్పుటకు, మెర్జింగ్ అండ్ డిలీషన్‌లో భాగంగా ఒక పోలీస్ స్టేషన్‌ను ఎలక్షన్ కమీషన్‌కు ప్రదిపాదించినట్లు తెలిపారు. అక్టోబర్ 27న ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్ పబ్లిష్ చెస్తామన్నారు.

హామీ ఇచ్చారు..అమలు చేశారు

- ఎంపీ, ఎమ్మెల్యే చొరవతో ఏపీఎండీసీ పాఠశాలలో మధ్యాహ్నభోజనం
- ప్రతి నెల రూ.10లక్షల సీఎస్ఆర్ నిధులు
- వెయ్యి మంది విద్యార్థులకు పౌష్టికాహారం



ఏపీఎండీసీ పాఠశాలలో మధ్యాహ్నభోజనం చేస్తున్న విద్యార్థులు



మంగంపేట ఏపీఎండీసీ పాఠశాల

ఓబులవారిపల్లె: మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో ఉద్యోగుల పిల్లలే కాకుండా కాకుండా చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన వారి పిల్లలు కూడా చదువుకుటున్నారు. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు దాదాపు 1136 మంది విద్యనభ్యసిస్తున్నారు. రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రైల్వేకొడూరు ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ,ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి చొరవతో వారికి ప్రతిరోజు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలవుతోంది. గత ఏడాది పాఠశాల వార్షికోత్సవానికి హాజరైన వారు ప్రభుత్వం ద్వారా పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఈ సంవత్సరం ఆగస్టు 23వ తేదీ నుంచి మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేశారు. వారంలో పప్పు ,పెరుగు అన్నం మూడురోజులు కోడి గుడ్డు, అరటి పండు, సాంబారు, పులిహోర, అదనంగా స్వీట్ అందిస్తున్నారు. నిత్యం దాదాపు వెయ్యి మందికి పౌష్టికాహారం అందిస్తున్నారు.

కమిటీ పర్యవేక్షణ..

పాఠశాలలో ప్రతి రోజు ఏపీఎండీసీ సీఎస్ఆర్ కమిటీ సభ్యులు ప్రతి రోజు భోజనం పరిశీలించి బాగా ఉందని నిర్ధారణ చేసిన అనంతరం విద్యార్థులకు వడ్డిస్తారు. భోజనం తిన్న అనంతరం పిల్లల అభిప్రాయాలను సేకరించి అధికారులకు నివేదికలు అందిస్తున్నారు. పతి విద్యార్థికి 50 రూపాయల చొప్పున ప్రతి నెల 1136 మందికి పది లక్షల రూపాయల నుంచి పన్నెండు లక్షల రూపాయల వరకు ఏపీఎండీసీ సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తున్నారు.నాణ్యమైన భోజనం అందించడం పట్ల విద్యార్థుల తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



మా ఇద్దరు పిల్లలు ఏపీఎండీసీ పాఠశాలలో చదువుతున్నారు. నెల రోజుల నుండి మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎండీ వీజీ వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– పైడాల హేమలత, గృహిణి, ఓబులవారిపల్లె

ఎంతో ఉపయోగకరం



ఏపీఎండీసీ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించడం హర్షణీయం. మా పిల్లలు ఇద్దరు ఇక్కడే చదువుతున్నారు. .ఉదయం ఆరుగంటలకే క్యారియర్ సిద్ధం చేసి ఇవ్వడం వల్ల సరిగా భోజనం చేసేవారు కాదు. ప్రస్తుతం పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగా ఉండటంతో అక్కడే తింటున్నారు.ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– షేక్ రజియా, గృహిణి, ముక్కావారిపల్లె

నిత్యం పర్యవేక్షణ



పాఠశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనంపై ఏపీఎండీసీ సీఎస్ఆర్ కమిటీ సభ్యులతో నిత్యం పర్యవేక్షిస్తాం.తర్వాతే విద్యార్థులకు వడ్డించేలా చర్యలు చేపట్టాం. పాఠశాలలో దాదాపు వెయ్యి మందికి నిత్యం భోజనం అందిస్తున్నాం.

– రేవతి, హెడ్‌టీచర్, ఏపీఎండీసీ పాఠశాల,మంగంపేట

నిధులు దుర్వినియోగమైనట్లు రుజువైతే చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ



పెద్దతిప్పసముద్రం: మహిళా సంఘాలకు మంజూరు చేసిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి లాంటి రుణాల మంజూరు, రికవరీలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆడిట్‌లో రుజువైతే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ అన్నమయ్య జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సీసీలు, సంఘమిత్రలతో స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. మహిళల జీవనోపాధుల మెరుగు కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాలు, సంక్షేమ పథకాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని సూచించారు. అనంతరం పీడీ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 30,161 మహిళా సంఘాలు ఉండగా వీరికి బ్యాంకు లింకేజీ ద్వారా రూ.261 కోట్ల రుణాలు మంజూరు చేయించామన్నారు. స్త్రీనిధిరుణాలు రూ.152 కోట్ల లక్ష్యం ఉండగా వాటిలో ఇప్పటి వరకు రూ.85.44 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇటీవల మండలంలో చర్చనీయాంశంగా మారిన సంఘమిత్రల నిర్లక్ష్య ధోరణి, చేతివాటం, ఆడిట్‌లో బహిర్గతమైన నిధుల దుర్వినియోగంపై పీడీ మాట్లాడుతూ అన్ని గ్రామ సమైఖ్య సంఘాల్లోనూ ఆడిట్ జరుగుతుందని, నిధులు దుర్వినియోగమైనట్లు ఆధారాలతో బట్టబయలైతే ఏ అధికారి అయినా, సంఘమిత్రలైనా వారిపై శాఖా పరమైన చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని, అంతేకాకుండా ఆర్ఆర్ యాక్ట్ కేసు నమోదు చేసి నగదును రికవరీ చేస్తామని ఆయన తెలిపారు.

అప్పులు, వివాహేతర బంధంతోనే అంతం?

- షేర్ మార్కెట్‌లో భారీగా నష్టాలు
- తన సమస్యను చెప్పకుండా దాచిన వైనం
- సహజీవనం చేస్తున్న మహిళ నుంచి ఒత్తిళ్లు
- హెడ్ కానిస్టేబుల్ ఉదంతంపై ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి

ఆయనో హెడ్ కానిస్టేబుల్.. కుటుంబానికి కూడా హెడ్ (యజమాని). వారిని కంటికి రెప్పలా కాపాడాల్సింది పోయి.. మృగంలా మారాడు. తన సమస్యలు పరిష్కరించుకోలేక.. కుటుంబాన్నే అంతం చేసుకున్నాడు. భార్యాపిల్లలను చంపి.. తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలో తీవ్ర విషాదం నింపిన విషయం తెలిసిందే. అప్పులు, వివాహేతర సంబంధమే ఇందుకు కారణాలని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.


హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరంలో ఓ హెడ్ కానిస్టేబుల్ తన భార్య, ఇద్దరు కుమార్తెలను బుధవారం రాత్రి పిస్టల్‌తో కాల్చి తానూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లాలో తీవ్ర విషాదం నింపిన విషయం తెలిసిందే. ఇది గురువారం ఉదయం వెలుగు చూసిన సంగతీ విదితమే. షేర్ మార్కెట్ ద్వారా రూ.లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడని, మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించడం వలనే అతను ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టాడని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ టి. వెంకటేశ్వర్(51) రైటర్‌గా విధులు నిర్వర్తిస్తుండే వారు. ఆయన మంచితనానికి మారుపేరుగా, వృత్తిలో నిబద్ధతగా పని చేసేవారని పేరు తెచ్చుకున్నాడు. ఆయనకు భార్య మాధవి(47)తోపాటు డిగ్రీ చేస్తున్న లాస్య(21), పదో తరగతి చదువుతున్న అభిజ్ఞ(16) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం రాత్రి తన అభిజ్ఞను ట్యూషన్ నుంచి ఇంటికి తీసుకుని వచ్చాడు. తర్వాత మరలా స్టేషన్ వెళ్లి స్ట్రాంగ్‌రూంలోని పిస్తోల్‌ను తన వెంట తెచ్చుకున్నాడు. వారి ఇంటిలో ఏనాడూ గొడవలు జరగకపోవడంతో తమను చంపుతాడని భార్య,పిల్లలకు ఏమాత్రం తెలీదు. అలాంటి తరుణంలో కుటుంబ యజమాని హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్ కొన్ని గంటల వ్యవధిలోనే మృగంలా మారాడు. తన భార్య, పిల్లలను తానే చేతులారా చంపుతున్నానని మరచిపోయాడు. వారు నిద్రిస్తున్న సమయంలో పెద్ద కుమార్తె లాఖిన్య అలియాస్ లాస్యను మొదట నుదిటిపై కాల్చాడు. ఆమె కొనఊపిరితో వుందని భావించి ఛాతీపై కాల్చాడు. రెండవ కుమార్తె అభిజ్ఞ, భార్య మాధవిలను కూడా వారి నుదిటిపైనే పాయింట్ బ్లాంక్‌లో కాల్చేశాడు. చివరగా తాను కణతపై కాల్చుకుని మరణించాడు. నాలుగు మరణాలకు కారణం కేవలం వెంకటేశ్వర్ చేసుకున్న అప్పులు, వీటితోపాటు రమాదేవితో వివాహేతర సంబంధమేనని తెలుస్తోంది.

బంధువులు ఆర్థికంగా బాగున్నా..

హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌కు షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టే అలవాటుంది. దీంతో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి పోగొట్టుకున్నాడు. కొన్నేళ్ల క్రితం తన సోదరుడు హైదరాబాద్ నుంచి వచ్చి దాదాపు రూ.20 లక్షలు తీర్చి వెళ్లారు. ఈ ఏడాది జనవరిలో ఓ బ్యాంక్‌లో రుణం కూడా తీసుకున్నాడని సమాచారం. అంతేగాక పలువురి నుంచి అప్పులు తీసుకుని వారికి చెక్కులు, బాండ్లు ఇచ్చాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో తన తల్లి మరణించిన సమయంలో అంత్యక్రియలను జరిపించేందుకు డబ్బులు లేకపోవడంతో సహచర సిబ్బంది ద్వారా తీసుకున్నాడు. అలాగే కొన్నేళ్ల క్రిందట రమాదేవితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఆమెతో సహజీవనం చేసేవాడు. ఆమె కూడా తనకు తెలిసిన వారు, బంధువుల దగ్గర అప్పు చేసి డబ్బులను ఇప్పించింది. ఆర్థిక సమస్యలున్నా, మరో మహిళతో సహజీవనం చేసినా భార్య, పిల్లలను ఏనాడూ నిర్లక్ష్యం చేయలేదు. రమాదేవితో వివాహేతర సంబంధం వున్న విషయం తోటి కానిస్టేబుళ్లకు కూడా తెలీదు. ఏనాడూ సిబ్బందికి ఆర్థిక సమస్యల గురించి చెప్పలేదు. సోదరుడు, సోదరి హైదరాబాద్, బెంగళూరులో స్థిరపడ్డారు. బంధువులంతా ఆర్థికంగా బాగున్నారు. ఇటీవలి కాలంలో బంధువుల నుంచి క్షేమ సమాచారాలు లేవు. దీంతో వెంకటేశ్వర్ ఆర్థిక పరిస్థితి గురించి వారికి తెలియదు. ఆర్థిక సమస్యలతోపాటు రమాదేవి నుంచి ఒత్తిళ్లు వుండటంతో, వాటన్నింటిని మనసులో పెట్టుకుని ఎవరికీ చెప్పుకోలేక, తనతోపాటు తన కుటుంబాన్ని బలి తీసుకున్నాడు.


హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్, భార్య మాధవి మృతదేహాలు



లాస్య, అభిజ్ఞ మృతదేహాలు

అన్యాయంగా కుటుంబాన్ని..

'సమస్య తనదైనపుడు అభం శుభం తెలీని భార్యాపిల్లలను ఎందుకు చంపాలి. అదేదో తానొక్కడే చనిపోయి వుంటే.. కుటుంబమైనా బాగా వుండేది కదా' అని అందరూ చర్చించుకుంటున్నారు. సమస్యలను భార్యాపిల్లల దగ్గర కానీ, స్నేహితుల వద్ద కానీ చర్చించకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. 'స్నేహితులకో, బంధువులకో చెప్పి వుంటే ఎవరైనా సాయం చేసేవారు కదా.. ఎంతో అన్యోన్యంగా వున్న కుటుంబాన్ని ఎందుకు పొట్టన పెట్టుకున్నాడు' అని స్థానికంగా అంటున్నారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

నలుగురి మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి

హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్, భార్య, ఇద్దరు పిల్లల మృతదేహాలకు పోలీసులు కడప రిమ్స్‌లో సిటీ స్కానింగ్ చేయించారు. పిస్టోల్ ద్వారా కాల్చిన తరువాత సదరు బుల్లెట్‌లు ఎంత మేరకు శరీరంలోకి దిగబడ్డాయో తెలుసుకునేందుకు సిటీ స్కానింగ్ చేయించారు. తరువాత పోస్టుమార్టం చేయించారు. బంధువులకు మృతదేహాలను అప్పగించారు. పోలీసు అధికారులు, బంధువులు.. మృతదేహాలకు శుక్రవారం మోచంపేటలోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. చివరిచూపు చూసేందుకు కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం, ఎస్‌ఐలు జయరాముడు, సంజీవరాయుడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ తదితరులు వచ్చి, మృతదేహాలకు నివాళులు అర్పించారు. హైదరాబాద్, బెంగుళూరులలో స్థిరపడ్డ వారి బంధువులు వచ్చి అంత్యక్రియలలో పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

మదనపల్లె : మునక్కాయలు కోసేందుకు మిద్దెపైకి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. బసినికొండ అగ్గిపెట్టల ఫ్యాక్టరీ సమీపంలో నివాసం ఉంటున్న రమణ కుమారుడు టి.శ్రీనివాసులు(45) సొంతంగా కారు పెట్టుకుని డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తనకు బాగా తెలిసిన వ్యక్తులు అమెరికా నుంచి వస్తుండటంతో వారి ఇంటిలో గ్యాస్‌సిలిండర్ పెట్టి వచ్చేందుకు అన్న సుబ్రహ్మణ్యంతో కలిసి రెడ్డెప్పనాయుడు కాలనీలోని ఇంటికి వెళ్లాడు. అక్కడ గ్యాస్ సిలిండర్ ఉంచిన తర్వాత ఇంటి ప్రాంగణంలో మునగచెట్టు విపరీతంగా కాయలు కాసి ఉండటంతో.. తన ఇంటికి మునక్కాడలు తీసుకెళదామని భావించాడు. అన్న సుబ్రహ్మణ్యంను కిందనే ఉండాలని చెప్పి మిద్దెపైకి వెళ్లి వంగి చెట్టులో కాయలు కోయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో కాయలు కోస్తూ ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారి కిందకు పడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడం విపరీతమైన రక్తస్రావంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఊహించని ఘటనతో షాక్‌కు గురైన అన్న సుబ్రహ్మణ్యం తేరుకుని స్థానికుల సాయంతో ఆటోలో శ్రీనివాసులును జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాసులు మృతి చెందాడని నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య గీత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటి యజమాని మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

నాటు సారాపై గట్టి నిఘా


జిల్లా నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ వీబీ రాజ్‌కమల్

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో నాటుసారా తయారీ, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అడిషనల్ ఎస్పీ వీబీ రాజ్‌కమల్ అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో నెల వారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. నాటుసారా తయారీ, విక్రయాలపై నమోదైన కేసుల వివరాలను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నాటుసారా తయారు చేసే గ్రామాల్లో అధికారులు ప్రతి రోజూ 2 లేదా 3 గ్రామాలలో తనిఖీలు నిర్వహించాలని ఏఎస్పీ సూచించారు. సిబ్బంది సహకారంతో నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుతమని తెలిపారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల చెక్‌పోస్టుల వద్ద అధికారులు వాహన తనిఖీలు నిరంతరం నిర్వహించాలన్నారు. తద్వారా ఇతర ప్రాంతాల నుంచి ప్రభుత్వం నిషేధించిన గుట్కా, ఖైనీ అక్రమ రవాణా జరగకుండా అరికట్టవచ్చని పేర్కొన్నారు. జూదం, క్రికెట్ పందేలు నిర్వహించకుండా కట్టడి చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణా నివారించేలా మదనపల్లి, మొలకలచెరువు సరిహద్దు రాష్ట్రాలలో నిఘాను పెంచాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బందికి సూచించారు. అలాగే సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవడం ద్వారా కచ్చితమైన సమాచారంతో నాటుసారా తయారు చేసే బట్టీల పైన, రవాణా చేసే ప్రదేశాల్లోనూ దాడులు నిర్వహించాలన్నారు. నాటుసారా తయారీలో అక్రమ రవాణాలో సంబంధం ఉన్న అనుమానితులను మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి వారిని బైండోవర్ చేయాలని సూచించారు. నాటుసారా కేసులో జైలుకు వెళ్లి వచ్చిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించడం ద్వారా.. తిరిగి నాటుసారా జోలికి వెళ్లకుండా చేయాలన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలలో ఎక్కువ కేసులలో ఉన్న వారిపై పీడీ యాక్ట్‌కు సిఫార్సు చేయాలని అడిషనల్ ఎస్పీ అధికారులకు తగిన సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇచ్చారు.

బైక్‌ల అధిక శబ్దానికి బ్రేక్


సైలెన్సర్లను రోడ్‌రోలర్‌తో తొక్కించేస్తున్న సీఐ, ఎస్‌ఐ, పోలీసులు

రాజంపేట : రాజంపేట పట్టణంలో కొంత మంది యువత పెద్దపెద్ద సౌండ్స్‌తో బైకులను నడుపుతూ ప్రజలను ఇబ్బంది పెట్టడం అధికమైంది. వీరికి పోలీసులు బ్రేక్ వేశారు. శుక్రవారం అర్బన్ సీఐ నరసింహారావు నేతృత్వంలో పట్టణ ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో.. శబ్దకాలుష్యం చేసే బైకులను గుర్తించేందుకు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టామన్నారు. కొంత మంది ప్రత్యేకించి పెద్దగా సౌండ్ వచ్చేందుకు సైలెన్సర్లు పెట్టుకొని తిరుగుతున్నారన్నారు. మొదటిసారిగా వారి బైకులు ఉన్న సైలెన్సర్లను పీకివేశామన్నారు. వాటిని రోడ్‌రోలర్‌తో తొక్కించామన్నారు. మరోసారి ఇలాగే ప్రవర్తించే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి, బైకులను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై కత్తితో దాడి

మదనపల్లె : పశువులను తన పొలంలోకి తోలవద్దన్నందుకు వృద్ధుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. మాలేపాడు పంచాయతీ ఎగువవెంకటయ్యగారిపల్లెకు చెందిన ఎం.చెన్నప్ప కుమారుడు మూడే వెంకటరమణ(60) తన పొలంలోకి పశువులు తోలవద్దని దిగువ వెంకటయ్యగారిపల్లెకు చెందిన నరసింహులును అన్నాడు. ఇద్దరి మధ్య మాటకుమాట పెరిగి ఘర్షణ జరిగింది. ఈ గొడవలో నరసింహులు కత్తితో వెంకటరమణపై దాడి చేశాడు. ఈ సంఘటనలో వెంకటరమణ తలకు తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : అవమానభారంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన చోటుచేసుకుంది. మదనపల్లె జన్మభూమికాలనీకి చెందిన వెంకటరమణ కుమార్తె గాయత్రి(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పని చేస్తోంది. ఇటీవల వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆమె బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ బంధువుల ఇంట్లో బంగారు గొలుసు చోరీకి గురైంది. అయితే ఈ విషయంలో గాయత్రిపై వారు అనుమానం వ్యక్తం చేయడంతో.. తీవ్ర మనస్తాపంతో గురువారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ సమస్యలతో ఇద్దరు..

వేర్వేరు ప్రాంతాల్లో కుటుంబ సమస్యలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లెలోని రామారావు కాలనీకి చెందిన శ్రీనివాసులు భార్య ఎం.అంజలి(32)కుటుంబ సమస్యలతో ఎలుకల నివారణ మందు తిని గురువారం రాత్రి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బి.కొత్తకోట బీసీ కాలనీకి చెందిన వెంకటస్వామి కుమారుడు వెంకటరమణ(35) కుటుంబ సమస్యలతో శుక్రవారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.